ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

గురువారం 15 ఫిబ్రవరి 2024



జీవో నెంబరు-3ని పునరుద్ధరిస్తాం..

'గిరిజనుల సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబరు-3ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. టీడీపీ-జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను పునరుద్ధరిస్తాం. ఏజెన్సీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటా. ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు నిలిపివేసిన 17 సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం. ఎస్టీ నియోజకవర్గాల్లో ఏడుకు ఏడు స్థానాలను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం. గిరిజనుల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తాం' అని యువనేత నారా లోకేశ్ అన్నారు.



పార్వతీపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లోకేశ్, బోనెల విజయచంద్ర

'ఖాళీగా కనిపించిన భూములను కబ్జా చేయడం.. చెరువును మాయం చేయడం.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకోవడం.. ఐదేళ్లుగా పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు చేసింది ఇదే. ఆయనకు అవినీతిరావు అని పేరు పెట్టాలేమో. ఇక సాలూరు రిమోట్ కంట్రోల్ చిన్న శ్రీను చేతిలో ఉంది. ఆయన ఎటు తిరగమంటే రాజన్న దొర అలా తిరుగుతారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం చాలా దారుణంగా ఉంది'

- పార్వతీపురం, సాలూరు శంఖారావం సభల్లో నారా లోకేష్



ఆయనో అవినీతిరావు

పెద్ద సైకో జగన్ అయితే.. చిన్న సైకో జోగారావు

- భూములు కబ్జా చేయడం.. ఉద్యోగాలు అమ్ముకోవడం..
- ఐదేళ్లుగా పార్వతీపురం ఎమ్మెల్యే చేసింది ఇదే
- సాలూరు రిమోట్ కంట్రోల్ చిన్న శ్రీను చేతిలో..
- ఆయన ఎటు తిరగమంటే రాజన్న అలా తిరిగేస్తారు
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజం
- తాము రాగానే జీవో నెంబరు-3ని పునరుద్ధరిస్తామని హామీ

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర 'మన్యం'లో ఉత్సాహంగా సాగింది. తొలిరోజు పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. తొలిసారి జిల్లాలో అడుగుపెట్టిన లోకేశ్‌కు ఘన స్వాగతం లభించడం, శంఖారావం కార్యక్రమం విజయవంతమవడంతో పార్టీ శ్రేణులు కూడా మరింత జోష్‌తో ముందుకు సాగుతున్నారు. కాగా రెండో రోజు బుధవారం పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో లోకేశ్ యాత్ర నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనపై ధ్వజమెత్తారు. సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయని, రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక బాధ్యత వహిస్తానని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులు, అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇచ్చారు.

జగన్‌కు సవాల్..?

'ఎన్నెన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. గద్దెనెక్కగానే అవన్నీ మర్చిపోయారు. దోచుకోవడమే పరమావధిగా పెట్టుకున్నారు. సీఎం జగన్ అవినీతి, అక్రమాలపై.. మా చిత్తశుద్ధిపై బహిరంగ చర్చకూ సిద్ధమా?' అని లోకేశ్ సవాల్ విసిరారు. 'బ్రదర్ జగన్.. టైం, డేట్ నువ్వు చెప్పు.. చర్చకు నేను సిద్ధం' అని తెలిపారు. రెడ్‌బుక్‌లో ఎక్కిన ప్రతి పేరుకు చట్టపరంగా రిటన్ గిఫ్ట్ ఉంటుందన్నారు. రెడ్ బుక్‌ను చూస్తే.. వైసీపీ నాయకులకు వణకు పుడుతుందని తెలిపారు. పార్వతీపురం మండలం వెంకంపేట వద్ద నిర్వహించిన శంఖారావం సభలో నారా లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..



పార్వతీపురం సభలో టీడీపీ శ్రేణుల సందడి

అవినీతికి కేరాఫ్ పార్వతీపురం ఎమ్మెల్యే

అవినీతి, అక్రమాల్లో సీఎం జగన్ మొదటిస్థానంలో ఉంటే, విజయసాయిరెడ్డి రెండో స్థానంలో ఉండేవారు. అయితే ఇప్పుడు ద్వితీయ స్థానంలో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉన్నారు. అవినీతిలో ఆయన విజయసాయి రెడ్డిని మించిపోయారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు. ఆయనకి అవినీతిరావు అనే పేరుపెట్టాలేమో. ఎక్కడ భూమి కనిపించినా కబ్జా చేస్తున్నారు. చెరువు కనిపిస్తే దానిని మాయం చేసి.. పట్టాలు సృష్టిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకుంటున్నారు. జగన్‌రెడ్డి పెద్ద సైకో అయితే చిన్న సైకో జోగారావు. అధికారంలోకి వచ్చిన వెంటనే.. పార్వతీపురం ఎమ్మెల్యే అవినీతి అక్రమాలపై జ్యుడీషియల్ దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్ల పేర్లు రెడ్ బుక్‌లో ఎక్కించాలని కార్యకర్తలు కోరగా.. తప్పకుండా అంటూ లోకేశ్ స్పందించారు.



సాలూరు సభలో మహిళలు ఇలా..

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.వెయ్యి కోట్లుతో పార్వతీపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం. జంఝావతి పనులు చేసేందుకు టీడీపీ హయాంలో రూ.43 కోట్లు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ నిధులను రద్దు చేసింది. పార్వతీపురం నియోజక వర్గంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం. టీడీపీ - జనసేన పార్టీ అధికారం చేపట్టాక నియోజక వర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. జంఝావతి ప్రాజెక్టు ద్వారా సీతానగరం, బలిజపేట మండలానికి సాగునీరు అందిస్తాం. క్రీడా స్టేడియం ఏర్పాటు చేస్తాం. పార్వతీపురంలో బైపాస్ రోడ్డు నిర్మిస్తాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

హామీలు ఏమయ్యాయి..?

సీఎం జగన్ పాదయాత్ర సమయంలో, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? భోగాపురం ఎయిర్‌పోర్టు, తోటపల్లి, జంఝావతి ద్వారా పార్వతీపురం నియోజకవర్గ రైతులకు సాగు నీరందిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదు. పార్వతీపురంలో కూడా తాగునీటి, డంపింగ్ యార్డు కూడా సమస్య పరిష్కరించలేదు. సీతానగరం వంతెన నిర్మాణం పూర్తి చేయలేదు. బైపాస్ రోడ్డు నిర్మించలేదు. మొత్తంగా సీఎం జగన్ ఇచ్చిన 50 హామీలు నెరవేర్చలేదు.

కష్టపడిన వారికే పదవులు

టీడీపీ కోసం కష్టపడిన వారికి, 2019 నుంచి ఇప్పటివరకు అత్యధికంగా అక్రమ కేసులు నమోదైన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తాం. ప్రజల చుట్టూ తిరుగుతూ పార్టీ గెలుపుకోసం కృషి చేసిన వారి దగ్గరకు వస్తా. అండగా ఉంటా.

అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు

వైసీపీ అక్రమాలపై ప్రశ్నించిన పార్వతీపురం కౌన్సిలర్ నారాయణరావును కొట్టడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణం. ఆయనకు పార్టీ అండగా ఉంటుంది. వార్డును అభివృద్ధి చేయాలని, తాగునీరందించాలని టీడీపీ కౌన్సిలర్ అడిగితే తప్పా! ఆయనపై కేసులు పెట్టి, వార్డుకు తాగునీరు సరఫరా నిలిపివేయడం సమంజసమా? చట్టాన్ని అతిక్రమించిన వారి పేర్లు రెడ్ బుక్‌లో రాస్తున్నా. అధికారంలోకి రాగానే అటువంటి వారిని జైలుకు పంపిస్తా. పార్వతీపురం నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి కావాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలి. అనంతరం సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వివరించారు.

అభివృద్ధి పనులేవీ చేయలేదు..



స్థానిక ఎమ్మెల్యే.. టీడీపీ కార్యకర్తలు, నేతల ఇళ్లపైకి గూండాలు, పోలీసులను పంపి వేధిస్తున్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారు. దాడులకు తెగ బడుతున్నారు. అయితే వారికి వడ్డీతో సహా తిరిగి చెల్లించే రోజు దగ్గరలోనే ఉంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనీ చేయలేదు. జంఝావతి ద్వారా నియోజకవర్గంలో ఆయకట్టుకు నీరందించలేకపోయారు. వైద్య కళాశాల మంజూరు చేశామని కనీసం శంకుస్థాపన కూడా చేయలేకపోయారు. టిడ్కో ఇళ్ల పంపిణీలోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలి. టీడీపీ-జనసేన పార్టీ అధికారంలోకి వస్తే.. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం.

- బోనెల విజయచంద్ర, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్వతీపురం

డోలీ కష్టాలు తప్పడం లేదు



నియోజకవర్గంలో గిరిజనులు, రైతులు, మోటార్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వం హయంలో గిరిశిఖర గ్రామాల గర్భిణుల కోసం వసతిగృహాలు ఏర్పాటు చేస్తే వైసీపీ సర్కారు వాటిని నీరుగార్చింది. ఫీడర్ అంబులెన్స్‌లు లేకుండా చేసింది. వైసీపీ ప్రభుత్వానికి గిరిజనుల సమస్యలు ఏ మాత్రం పట్టడం లేదు.

- గుమ్మిడి సంధ్యారాణి,
టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు ,
సాలూరు

రిమోట్‌కంట్రోల్ చిన్నశ్రీను చేతిలో..

- ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం ఇంత దారుణమా?: లోకేశ్



సాలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సాలూరు,ఫిబ్రవరి 14: 'సాలూరు ఎమ్మెల్యే రాజన్నదొర నాలుగుసార్లు గెలిచి ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. అయితే అభివృద్ధిలో సాలూరు దూసుకు పోవాలి..కానీ ఇక్కడా పరిస్థితి లేదు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. సాలూరు ఆర్టీవో కార్యాలయం సమీపంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. ' ఇంకులేని పెన్ను ఎమ్మెల్యే రాజన్నదొర. రిమోట్ కంట్రోల్ అంతా వైసీపీ జిల్లా నేత చిన్న శ్రీను చేతిలోనే ఉంది. చిన్నశ్రీను ఏది చెప్తే అదే డిప్యూటీ సీఎం చేస్తారు. లెఫ్ట్‌కు తిరగమంటే లెఫ్ట్‌కు, రైట్‌కు తిరగమంటే రైటుకు తిరగాల్సిందేనని అన్నారు. ఉప ముఖ్య మంత్రి నియోజక వర్గం ఇంత దారుణంగా ఉంటుందా?..





పార్వతీపురంలో..

సాలూరులో లారీ పరిశ్రమపై ఆధారపడి ఎంతోమంది ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం పన్నులతో వారిని బాదేస్తోంది. రెండు నెలలు ఓపిక పడితే.. అతితక్కువ పన్ను వేసే బాధ్యత తీసుకుంటాం. కియా మాదిరి పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగలకు ఉపాధి కల్పిస్తాం.' అని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఏటా డీఎస్సీ..

'టీడీపీ-జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా తప్పకుండా డీఎస్సీ తీస్తాం. డేటు.. టైం.. రాసుకో తమ్ముడు.. డీఎస్సీ ప్రకటించే బాధ్యత నేను తీసుకుంటున్నా. ఉద్యోగాలు వచ్చే వరకు సమయం పడితే నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ.3 వేలు అందిస్తాం' అని లోకేశ్ తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో క్రికెట్ స్టేడియం కట్టారా? ట్రైనింగ్ మొదలు పెట్టారా? అని లోకేశ్ ప్రశ్నించారు. 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా జరిగిన క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు గెలిచినా.. పాచిపెంట టీంలో టీడీపీ వారు ఉన్నారని విజేతలుగా ప్రకటించకపోవడం దారుణమన్నారు.

ఎండను సైతం లెక్కచేయక..

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభలు విజవంతమయ్యాయి. భారీగా టీడీపీ-జనసేన శ్రేణులు, ప్రజలు, అభిమానులు హాజరయ్యారు. ఎండను సైతం లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. మహిళలు కూడా ఎంతో ఉత్సాహంగా సభ ప్రాంగణాలకు చేరుకున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సభలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి తమ అభిమానం చాటుకున్నారు.

పోరుబాటలో ఉద్యోగులు

- జిల్లావ్యాప్తంగా నిరసనలు
- వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



పార్వతీపురం జిల్లా ఆసుపత్రి వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, వైద్య సిబ్బంది

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్/ పాలకొండ/ కురుపాం: వైసీపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా జిల్లాలో ఉద్యోగులు పోరుబాట పట్టారు. తొలిరోజు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి వద్ద ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు జీవీ కిషోర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీల ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఇప్పటి వరకు పదకొండు సార్లు ప్రభుత్వంతో చర్చలు జరిపామన్నారు. అయితే ఎటువంటి ఫలితం లేకపోవడం వల్లే ఆందోళన కార్య క్రమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డీఏ, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవుల బకాయిలు, పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ సమస్యలపై సర్కారు స్పందించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈనెల 15, 16 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు, 17న ఆయా మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, 20న కలెక్టరేట్ ఎదుట నిరసన, 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ● సాలూరులో జేఏసీ చైర్మన్ ఎ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జేఏసీ కో చైర్మన్ మీసాల వెంకట గౌరీశంకరరావు, నాయుడు ప్రభాకర్, అన్ను సురేష్, పద్మావతి, అచ్యుతాంబ తదితరులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సాలూరు మున్సిపల్, రెవెన్యూ, ఉపాధ్యాయులు తదితరులు కూడా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ● పాలకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వరహాలకు జేఏసీ డివిజన్ గౌరవాధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు వాసుదేవరావు, కార్యవర్గ సభ్యులు , రెవెన్యూ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ● కురుపాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కురుపాం తహసీల్దార్ కార్యాయంలో డీటీ బి.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో కురుపాం తాలూకా యూనిట్ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు ప్రకాశరావు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఎ.సత్యనారాయణ, ఎస్.రమణ, పి.భారతి తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో..

సరస్వతీ నమస్తుభ్యం

- ఘనంగా వసంత పంచమి
- ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

పాలకొండ,ఫిబ్రవరి 14: జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో వసంత పంచమిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయాన్నే సరస్వతీ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండలోని కోట దుర్గమ్మ ఆలయంలో 60 మంది బాలబాలికలకు అక్షరాభ్యాసం చేశారు. నక్కలపేటలోని జ్ఞాన సరస్వతీదేవి మందిరంలో 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. సాలూరు, పార్వతీపురం, కురుపాంలోని సరస్వతీ ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు చేశారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



కోటదుర్గమ్మ ఆలయంలో అక్షరాభ్యాసాలు చేస్తున్న దృశ్యం


నెల్లిమర్లలో ఓ వీధిలో మార్చిన విద్యుత్ లైన్ ఇదే

రూ.4 లక్షలు ఏమయ్యాయి?

● ఎంపీ ల్యాడ్స్ నిధులతో పనులు చేశామంటున్న అధికారులు ●స్థానికుల నుంచి విరాళాలు సేకరించిన వైసీపీ నేతలు
● విద్యుత్ లైన్ మార్పు పనులపై జరజాపుపేటలో వివాదం ● వసూళ్ల సంగతేంటని ప్రశ్నిస్తున్న ప్రజలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 14: ఆ వీధి మధ్యగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు వెళ్తున్నాయి. తరచూ వైర్లు రాపిడికి గురై నిప్పురవ్వలు పడుతున్నాయి. భయపడిన వీధి వాసులు వైర్లు మార్చాలని కొన్నాళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు. ఫలితం లేకపోవడంతో స్థానికులే రూ.4 లక్షలు పోగు చేసుకున్నారు. అధికార పార్టీ నాయకుల సాయంతో విద్యుత్ లైన్ మార్పిడి పనులు పూర్తిచేసుకున్నారు. ఇదంతా తమ చందాలతో జరిగిందని భావిస్తున్నారు. కానీ ఆ పనులు ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేశారని తాజాగా తెలియడంతో షాక్‌కు గురయ్యారు. తాము ఇచ్చిన రూ.4 లక్షల మాటేమిటి? అని ప్రశ్నిస్తుంటే వైసీపీ నేతల నోట మాట రావడం లేదు. నెల్లిమర్ల నగర పంచాయతీ 18 వార్డులోని జరజాపుపేటలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించి వివరాల్లోకి వెళితే..

జరజాపుపేటలోని ఎల్లమ్మ తల్లి ఆలయం నుంచి ఎనుబోతుల వీధి మీదుగా ఎస్సీ కాలనీ వరకూ 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ఇళ్లకు దగ్గరగా ఉండడంతో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. వైర్లు రాపిడికి గురై మంటలు పుడుతున్నాయి. దీంతో ఏడాదిన్నరగా ఇక్కడి విద్యుత్ లైన్ మార్చాలని విద్యుత్ శాఖ అధికారులను, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతూ వచ్చారు. వారిలో ఎటువంటి చలనం లేకపోవడంతో స్థానికులే చందాలు వేసుకుని పనులు చేయించుకోవాలనుకున్నారు. రూ.4 లక్షలు పోగుచేసుకున్నారు. ఆ మొత్తం కడితే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని స్థానిక నేతలు నమ్మబలికారు. కాగా 18 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు పక్కకు మార్చేందుకు గత ఏడాది ఆగస్టులో విద్యుత్ శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయి. కానీ అప్పట్లో పనులు చేపట్టలేదు. పదిరోజుల కిందట విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. అయితే ఈ పనులకు ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.7.44 లక్షలు వినియోగించారని స్థానికులు తెలుసుకున్నారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖను సంప్రదించగా సంబంధిత అధికారులు నిజమేనని తేల్చేశారు. వైసీపీ నేతలకు అందించిన రూ.4 లక్షలు ఏమయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మౌనమే సమాధానమవుతోంది. ఈ వీధుల్లోని స్థానికులు నిరుపేదలు. తరచూ అగ్నిప్రమాదాలకు భయపడి చందాల రూపంలో నగదు ఇచ్చారు. జరిగిన వ్యవహారం గురించి తెలుసుకుని వైసీపీ నేతలు తమను నిలువునా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

ప్రజల సొమ్ము ఇవ్వాలి

వీధిలో విద్యుత్ సమస్య ఉందని ఏడాదిన్నరగా అధికారులకు విన్నవించాం. అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించారు. గత ఏడాది ఆగస్టులో విద్యుత్ శాఖకు అనుమతులు వచ్చాయి. పదిరోజుల కిందట పనులు జరిగాయి. అయితే ఏడాది కిందటే స్థానికులు చందాల రూపంలో రూ.4 లక్షలు కూడబెట్టి వైసీపీ నేతలకు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులను అడుగుతుంటే ఎంపీ ల్యాడ్స్ నిధులతో పనులు చేపట్టినట్లు చెబుతున్నారు.

- రాజశేఖర్, స్థానికుడు

ఎంపీ ల్యాడ్స్ నిధులతోనే..

గ్రామంలో 18 స్తంభాలతో పాటు ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాం. ఇందుకుగాను ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.7.44 లక్షలు ఖర్చుచేశాం. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఎటువంటి రుసుం తీసుకోలేదు. విద్యుత్ శాఖ పరంగా ఎటువంటి వసూలు జరగలేదు.

-డి.పిచ్చయ్య, ట్రాన్స్‌కో ఏఈ, నెల్లిమర్ల

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● సంకిలిలో వ్యాన్‌ను ఢీకొట్టిన స్పోర్ట్స్ బైక్


బలివాడ కరుణ్ (ఫైల్)

రేగిడి: సంకిలి వద్ద వ్యాన్‌ను స్పోర్ట్స్‌బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఢీ కొన్నఘటనలో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీ సులు, స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలం లోని మజ్జి రామునిపేట గ్రామానికి చెందిన బలివాడ కరుణ్ (17), పొట్నూరు దిలీప్, బలి వాడ హరి స్నేహితులు. కరుణ్, దిలీప్ పాలకొండలో ఓ ప్రైవేటు కళా శాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, హరి రాజాంలో ఇంటర్ చదువుతున్నాడు. వీరు గ్రామంలో బుధవారం జరుగుతున్న పెళ్లివేడుకలో పాల్గొన్నారు. భోజనాల అనంతరం సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం అప్పాపురం స్నేహితుడు స్పోర్ట్స్ బైక్ తీసుకుని పాలకొండ వెళ్లేందుకు ముగ్గురు బయలుదేరారు. సంకిలి సుగర్స్ మెయిన్‌గేట్ వద్ద వ్యాన్ బ్యాక్ చేస్తుండగా అదే సమయంలో పాలకొండ వైపు వెళ్తున్న స్పోర్ట్స్‌బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బలివాడ కరుణ్ సంఘటన స్థలంలో మృతిచెందాడు. పొట్నూరు దిలీప్, బలివాడ హరిలకు గాయాలయ్యాయి. ప్రమాద సమాచారంపై రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ తెలియడంతో క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరిని ప్రథమచికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉంది. ఆయన అపస్మారకస్థితిలో ఉన్నాడు. కరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజాం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ మహీంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా మజ్జిరామునిపేటకు చెందిన బలివాడ ఈశ్వరరావు, చిన్నమ్మడులకు ఇద్దరు పిల్లలు. వీరిలో చిన్నవాడు కరుణ్. కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు. కుమారుడు మృతితో వారు రోది స్తున్నారు. గ్రామంలో వివాహం జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలో కరుణ్ మృతితో విషాదం నెలకొంది.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు


చిలకాం మలుపులో బోల్తా పడిన ఆటో

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14: వివాహ నిశ్చితార్థానికి వస్తున్న ఆటో మండలంలోని చిలకాం మలుపులో బుధవారం బోల్తా పడింది. ఈ ఘటనలో తెర్లాం మండలం ఉద్దవోలుకు చెందిన 15 మంది గాయపడ్డారు. వంగర మీదుగా రుషింగి వంతెన పైనుంచి జియ్యమ్మవలస మండలం గౌరీపురం గ్రామానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బస్సు సిబ్బంది పరిస్థితి చూసి ఆటోను పైకి లేపి ప్రాణాలను కాపాడారు. పెళ్లి కుమార్తెకు సంబంధించిన 15 మంది బంధువులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్వల్ప గాయాలకు గురైన వారిని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆటో డ్రైవర్ తప్పిదం కారణంగానే ఈ ప్రమాదం నెలకొందని గ్రామస్థులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద బుధవారం 40 మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన బి.నాయుడు మద్యం సీసాలు అక్రమంగా రవాణా చేస్తుండగా ఎస్ఐ బృందం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ● **భోగాపురం:** మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన కొలారమణను అరెస్టు చేసి 10 మద్యం సీసాలు సీజ్ చేసినట్లు సీఐ రవికుమార్ బుధవారం తెలిపారు. మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించి రమణ వద్దనుంచి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ● **రేగిడి:** రేగిడిలో బుధవారం నిర్వహించిన సోదాల్లో ఓ వ్యక్తి వద్ద 35 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు బెల్ట్‌షాపు నిర్వహణలో భాగంగా ఇంట్లో నిల్వ ఉంచిన సీసాలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసునమోదుచేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. తనిఖీలో కానిస్టేబుల్ శివ, సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● ముగ్గురికి గాయాలు.. వీరిలో ఇద్దరు చిన్నారులు


గాయపడిన హర్షిత

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 14: మండలంలోని బిత్రపాడులో బుధవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. నిమిషాల వ్యవధిలో ముగ్గురిని గాయపర్చింది. మరడాన సింహాచలం, చిన్నారులైన గంధారపు హర్షిత, నక్షత్ర (జెస్సీ)పై విరుచుకుపడింది. వెంటనే చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తరలించారు. అందుబాటులో ఉన్న వైద్యాధికారులు సునీల్‌కుమార్ టీకే, చంద్రవర్మ తగు చికిత్స అందించారు. తరువాత గ్రామస్థులు ఆ పిచ్చి కుక్కను చంపేశారు.

చోరీ కేసులో నిందితునికి జైలుశిక్ష

మక్కువ: హుండీ దొంగతనం కేసులో నిందితునికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ నరసింహమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019 సంవత్సరంలో స్థానిక భ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి ఆలయం, ములక్కాయవలస గ్రామం కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో హుండీల దొంగతనం జరిగింది. ఈ చోరీకి పాల్పడిన మక్కువకి చెందిన చిన్నగొడబ జగదీష్‌పై నేరారోపణ రుజువు కావడంతో సాలూరు మేజిస్ట్రేట్ కె.రమేష్ 8 నెలల జైలు శిక్షతో పాటు 500 రూపాయల జరిమానాను బుధవారం విధించారు.

హుండీచోరీ

లక్కవరపుకోట: ఎల్‌కోట జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీ మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైందని ఆలయ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గునపంతో పగలగొట్టి సొమ్ము మొత్తం తీసుకుపోయారని వెల్లడించారు. సుమారు 10 వేల నుంచి 15 వేల నగదు ఉంటుందని తెలిపారు. ఈ నెల 27న వార్షికోత్సవం ఉన్నందున ఇంతవరకూ హుండీ తెరవలేదని, ఇంతలో చోరీకి గురైందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

రెండు బైకులు ఢీ-నలుగురికి గాయాలు

బాడంగి, ఫిబ్రవరి 14: మండలంలోని ఎత్తుఖానా సమీపంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మండల కేంద్రంలో జరిగిన శంఖారావం సభకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న గజరాయునివలసకు చెందిన వారు గాయపడ్డారు. గజరాయునివలస వెళుతుండగా ముందు వెళుతున్న బైకును వెనుకనుంచి మరో బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నల్ల తిరుపతి, జామి అప్పన్న ల తలకు గాయాలయ్యాయి. వీరికి మెరుగైన వైద్యం అందించేందుకు బాడంగి సీహెచ్‌సీ నుంచి విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అలాగే తెర్లి రాము, కొల్లి సింహాచలంలకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరికి బాడంగి సీహెచ్‌సీలోనే చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసగించిన యువకుడు

రాజాం రూరల్: రాజాంలోని ఓ బాలికను చీపురుపల్లి మండలానికి చెందిన యువకుడు మోసగించాడు. గర్భవతిని చేసి ఆపై మొఖం చాటేయడంతో రాజాం పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. సామాజిక మాధ్యమంలో పరిచయమైన రాజాంలోని ఓ బాలికను చీపురుపల్లి మండలంలోని పెద్ద నడిపిల్లికి చెందిన బంకుపల్లి రవి మాయమాటలు చెప్పి ప్రేమలో దించాడు. మాయమాటలు నమ్మిన బాలిక గత ఏడాడి మార్చిలో రవితో కలిసి తిరుపతి వెళ్లి ఇంటికి వచ్చింది. ఆపై రవి ఒత్తిడి మేరకు రవి ఇంట్లో కొంతకాలం సహజీవనం చేసింది. ప్రస్తుతం ఏడోనెల గర్భవతిగా ఉన్న బాలిక రవి పెట్టిన శారీరక, మానసిక హింస తట్టుకోలేక రాజాం పోలీసులను బుధవారం రాత్రి ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ రవికిరణ్ శ్రీకాకుళంలోని రిమ్స్‌కు వైద్య పరీక్షల కోసం బాలికను పంపించారు.

మహిళ అదృశ్యం

భోగాపురం, ఫిబ్రవరి 14: అమటాం రాయవలస గ్రామానికి చెందిన వివాహిత పాలవలస ఈశ్వరమ్మ అదృశ్యమైనట్లు భర్త గణేష్ ఫిర్యాదు చేశారని సీఐ ఎ.రవికుమార్ బుధవారం తెలిపారు. గజపతినగరం మండలం ఎరుకులపేటకు చెందిన గణేష్‌కు సుమారు 10 ఏళ్ల క్రితం ఈశ్వరమ్మతో వివాహమైంది. భార్యాభర్తలు కొంత కాలంగా అమటాంరాయవలసలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 12న పాలవలస రమణ పుట్టిన రోజు వేడుకలకు గణేష్ అచ్యుతాపురం వెళ్లాడు. అనంతరం అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి చూసి.. భార్య లేనట్లు గుర్తించాడు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త గణేష్ ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

మొక్కలను నాటిన రెడ్ క్రాస్ సొసైటీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలోని గిరిజన ఆశ్రమ వసతి గృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ మొక్కలను నాటింది. డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, దొడ్డి సూర్యారావు, ఆశపు మల్లేశ్వరరావు, శ్రీనాథుల వెంకన్నబాబు ఉన్నారు.

18న కరాటే పోటీలు

రాజాం: రాజాంలోని ఈనెల 18న జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతం చేయాలని శివ సైన్యం అకాడమీ చీఫ్‌ఆర్గనైజరు శివ కోరారు. ఈ మేరకు బుధవారం రాజాంలో ఈపోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కటాస్, స్పారింగ్, టీమ్ కటా విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. రాజాం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి స్టెప్‌కాన్- 24

రాజాం రూరల్: రాజాంలోని జీఎంఆర్‌ఐటీ ప్రాంగణంలో ఈనెల 16, 17 తేదీల్లో జాతీయస్థాయి స్టెప్‌కాన్ -24 నిర్వహించనున్నట్లు జీఎంఆర్‌వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు నాలుగువేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు సదస్సులో సాంకేతిక ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

రాజవర్ధన్‌కు అభినందన

రాజాం: రాజాం నియోజకవర్గంలో బీఎల్‌ఏలు శత శాతం నియామకం పూర్తిచేయడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్‌ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల రాజవర్ధన్‌ను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మాణిక్యం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, వీరప్ప మొయిలీ, పల్లం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్‌రెడ్డి, మస్తాన్ వలి అభినందించారు. బుధవారం విశాఖలో ఉత్తరాంధ్ర జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తనను ఆదర్శంగా తీసుకుని మిగిలిన ఇన్‌చార్జిలు పనిచేయాలని సూచించినట్లు రాజవర్ధన్ తెలిపారు.

సామాజక సేవలో ముందుండాలి

రేగిడి: సామాజక సేవలో యువత ముందుండాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ ప్రసాద్ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తాటిపాడులో జీఎంఆర్ ఐటీ ఆరోరోజు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవావిభాగం కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబురావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్‌వీ ప్రసాద్, రేగిడి కోఆపరేటివ్ డైరెక్టర్ పేడ రామినాయుడు, ఉపాధ్యాయులు గౌరినాయుడు, మల్లిఖార్జున స్వామి పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

వేపాడ: మండలంలోని వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధరణి సారధ్యంలో నిర్వహించే 104 వైద్య శిబిరంలో 90మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధరణి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక రోగులు సుగర్, బీపీ, తదితర వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులను అందజేశామన్నారు. సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, 104 వాహన సిబ్బంది తదితరులు పాల్గొని రోగులకు సేవలు అందించారు.

కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

కొత్తవలస, ఫిబ్రవరి 14: కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇప్పుడున్న భవనాల నుంచి మార్పు చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న అద్దె భవనంలోకి మార్పు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకట కుమారి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మి, కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ తారకేష్ హాజరయ్యారు. కొత్త కార్యాలయంలో ఈ నెల 19 నుంచి కార్యకలాపాలు జరుగుతాయని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

ఘనంగా పోలిపల్లి పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారు, దర్శించుకుంటున్న భక్తులు

భోగాపురం: పోలిపల్లి గ్రామంలో పైడితల్లమ్మ ఆలయ శిఖర, విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, పాల్గొన్నారు. ప్రదీప్‌నాయుడు, సిరిసహస్ర అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

నాగబాబును కలిసిన మనోజ్‌కుమార్


నాగబాబును కలుసుకున్న మనోజ్‌కుమార్

బొబ్బిలి, ఫిబ్రవరి 14: జనసేన పార్టీ సీనియర్ నేత, పీఏసీ సభ్యుడు కొణిదెల నాగబాబును బొబ్బిలికి చెందిన సీనియర్ సామాజిక కార్యకర్త పెద్దింటి మనోజ్ కుమార్ కలుసుకున్నారు. బుధవారం అనకాపల్లిలో నాగబాబును కలిసి బొబ్బిలి ప్రాంతంలో తాజా రాజకీయ స్థితిగతులను వివరించారు.



విజయనగరం జ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసాలు.. అమ్మవారికి పూజలు


రాజాంలో..


బొబ్బిలిలో..

వైభవంగా వసంతపంచమి

● జ్ఞాన సరస్వతీ ఆలయంలో భారీగా అక్షరాభ్యాసాలు
● జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వేడుకలా కార్యక్రమం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 14: వసంత పంచమిని పురస్కరించుకుని ఎస్‌వీఎన్ నగర్‌లోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో బుధవారం తెల్లవారుజాము నుంచే సామూహిక అక్షరాభ్యాసాలు మొదలయ్యాయి. ఈ తంతు రోజంతా సాగింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చి తమ పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సుమారు 40 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. శారదా సేవా సంఘం ప్రతినిధులు గుడిశా శివ, శ్రీనివాస్, చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, మంచినీరుతో పాటు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ● **రాజాం రూరల్:** రాజాంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి పురస్కరించుకుని సామూ హిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్ర శర్మ సారధ్యంలో 300 మంది చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కూరాడ వెంకటరావు, ఈవో కేశవరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక చర్చి సెంటరులో గల శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక అక్షరా భ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి అధ్య క్షుడు పెంట స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సామాజిక సమరసతా వేదిక అధ్యక్షుడు రాగాల నరిసింగరావు, ఓం భారతి శక్తిపీఠం వ్యవస్థాపకులు భారతానంద మహారాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 34 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గొల్లపల్లి శ్రీదాడితల్లి ఆలయంలో అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని జ్ఞాన సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరా భ్యాసం చేయించారు. అలజంగి సీబీఎం పాఠశాలలో హెచ్ఎం మోజెస్ ఆధ్వ ర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు కృష్ణదాసు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ● **తెర్లాం:** స్థానిక శాఖా గ్రంథాలయంలో వసంత పంచమి పూజలను గ్రంథాల యాధికారి సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. కుమ్మరి పేట ఎంపీపీ స్కూల్ టీచర్ ఎ.రమేష్ కుమార్ సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు

● 19న జిల్లా వ్యాప్తంగా రాస్తారోకో


మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 14: నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు పూర్తి మద్దతు ప్రకటి స్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ భరోసా ఇచ్చారు. బుధవారం కేఎల్‌పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ, యాజమాన్యం ఉద్యోగులకు సంఘం లేకుండా చేసి గత మూడేళ్లుగా ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా నిరంకుశంగా చూసిందన్నారు. ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించుకుంటోందని ఆరోపించారు. ప్రశ్నించిన ఉద్యోగులను సస్పెండ్ చేయడం, బెదిరించడం వంటి చర్యలకు యాజమాన్యం పాల్పడుతోందన్నారు. సమస్యలపై ప్రశ్నించినందుకు ఫిబ్రవరి 1న విధులకు హాజరైన ఇద్దరు ఉద్యోగులను గేటు వద్దనే ఆపేశారన్నారు. యాజమాన్యం చర్చలు జరిపి న్యాయం చేసే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. 19న మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా జిల్లా వ్యాప్తంగా రాస్తారోకో చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారన్నారు. అప్పలసూరి, వి.లక్ష్మి, జి.శ్రీనివాసరావు, రమణ, కె.సురేష్, టీవీ రమణ, మధు, రాంబాబు పాల్గొన్నారు.

రేపటి బంద్‌కు సంపూర్ణ మద్దతు


సంఘీభావం తెలుపుతున్న రైతు కూలీ, కార్మిక సంఘాల నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 14: సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న గ్రామీణ బంద్‌కు ఇచ్చిన పిలుపునకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రైతు కూలీ సంఘం, పట్టణ కళాసీ సంఘం ప్రకటించాయి. బుధవారం కళాసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు కూలీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడారు. రైతుల పోరాట ఫలితంగా మూడు నల్లచట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించిన మోదీ ప్రభుత్వం తిరిగి అవే చట్టాలను దొడ్డిదారిన అమలులోకి తెచ్చేందుకు కుయుక్తులు చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్నంతటినీ కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కళాసీ సంఘ అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, రాజు, అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొప్పల వెలమలకు సముచిత స్థానం కల్పించాలి

గజపతినగరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున కొప్పలవెలమలకు సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘ రాష్ట్ర నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం అచ్చెన్నాయుడును తన నివాసంలో కలిసి, వినతిపత్రాన్ని అందజేశారు. అచ్చెన్నను కలిసినవారిలో ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు గొట్టాపు చిన్ననాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశీనాయుడు, జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొగ్గ దేముడు ఉన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో కొప్పలవెలమ ఓట్లు కాపు సామాజికవర్గం కంటే 10శాతం అధికంగా ఉన్నప్పటికీ రాజకీయాల్లో తమకు సముచిత స్థానం దక్కకపోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గం ఏర్పాటు అయినప్పటి నుంచి 1985, 1978లో కొప్పలవెలమకు అవకాశం రాగా, వంగపండు నారాయణప్పలనాయుడు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు తమకు అవకాశాలు లేక రాజకీయంగా ముందడుగు వేయలేకపోతున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో అయినా తమ సామాజికవర్గానికి అవకాశాలు కల్పించాలని వారు కోరారు.

తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలి


దీక్షలో ప్రసాదరావు తదితరులు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 14: తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు చనుమల్లు ప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట తెలగ కులస్థులు తమను బీసీల్లో చేర్చాలంటూ నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... తాము ఓసీగా ఉండడం వల్ల విద్యకు, ఉద్యోగాలకు దూరమవుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తెలగ కులస్థులను బీసీల్లో చేర్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలగ సంక్షేమ సంఘ నాయకులు మూర్తి, తీగల హరినాథ్, తాడి నానాజీ, పూనిశెట్టి శాంతి, రమణమ్మ, కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

● రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్


డ్రైవర్లను సత్కరించిన డీటీసీ రవీంద్రనాథ్, డీఎస్పీ విశ్వనాథ్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 14: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్‌లు అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలంటే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ అప్పలనాయుడు, అప్పలనారాయణ, డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కె.రమేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి


పాఠశాలను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారి

వేపాడ, ఫిబ్రవరి 14: విద్యార్థులకు నైతక విలువలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని బానాది మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజనాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేపట్టి ప్రభుత్వం పాఠశాల విద్యపై నమ్మకం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



రామభద్రపురం, ఫిబ్రవరి 14: పాతరేగ గ్రామంలో ముత్యాలమ్మతల్లి గుడి మూడో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారి జోగారావు అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త లోకారపు ముత్యాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చొక్కాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గేటు మూసేసి.. ఆసరా సంబరాలు


సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలను గేటు వద్ద ఆపుతున్న డ్వాక్రా మహిళలు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 14: శృంగవరపుకోట ఆకుల డిపో వద్ద బుధవారం జరిగిన ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతుండగానే బయటకు వెళ్లిపోయేందుకు వస్తున్న మహిళలను స్వయం సహాయక సంఘ సభ్యులు అడ్డుకున్నారు. ఆసరా నాలుగో విడత పంపిణి కార్యక్రమాన్ని ఇక్కడ మండల పరిషత్ అధికారులు, వైఎస్ఆర్ క్రాంతి పథకం అధికారులు ఏర్పాటు చేసారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గొప్పలను చెప్పుకునేందుకు ఎమ్మెల్యేతో పాటు డీసీసీబీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు తదితరులు సభావేదికపై కూర్చుని మాట్లాడుతున్నారు. సభావేదికపై కూర్చొన్నవారంతా చెప్పిందే చెబుతుండడంతో ప్రసంగాలకు విసిగిపోయిన మహిళలు బయటకు వెళ్లేందుకు రావడంతో గేటు వద్ద అడ్డుకుంటూ తిరిగి సభ వద్దకు పంపించడం కనిపించింది. శృంగవరపుకోట ఆకుల డిపో వద్ద బుధవారం వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో పాటు అతని వర్గీయులు హాజరుకాలేదు.

ఎస్‌కోట/ రూరల్: బుధవారం మండలంలోని రేవళ్లపాలెం కోటమ్మను రఘురాజు దర్శించుకున్నారు. రెండురోజుల క్రితం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసిన రఘురాజు ఎమ్మెల్యే కడుబండికి తాము మద్దతు ఇవ్వలేమని చెప్పినట్లు తెలుస్తుంది.

కేడర్‌లో ఉత్సాహం

- పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో 'శంఖారావం' విజయవంతం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు ఘన స్వాగతం
- జనసంద్రంగా మారిన సభలు
- భారీ తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు



పార్వతీపురంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహం



పిడికిలి చూపిస్తున్న లోకేశ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలోని పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించిన 'శంఖారావం' విజయవంతమయ్యింది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సభా ప్రాంగణాలు కిక్కిరిశాయి. పార్వతీపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో జనసమీకరణ జరిగింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తన ప్రసంగంతో పార్టీ కేడర్‌లో కొత్త జోష్‌ను నింపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఆదాడ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన శంఖారావం విజయవంతం అయ్యింది. లోకేశ్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు రిషివర్ధన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు విశ్వప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి) తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకే మా ఓటు

పార్వతీపురం రూరల్: యు.వెంకమ్మపేట పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలో ఉన్న పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల నుంచి సుమారు 20 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. అనేక మంది నిలబడి లోకేశ్ ప్రసంగాన్ని వింటూ చప్పట్లు కొట్టారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకే మా ఓటు అంటూ నినాదాలు చేశారు. లోకేష్ ప్రసంగం సాగుతున్నంత సేపు యువత కేరింతలు కొడుతూ జై చంద్రబాబు.. జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కె.శ్రావణ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.మోహన్‌రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోను దేవిచంద్రమౌళి, వేణుగోపాలనాయుడు, రౌతు వేణుగోపాల్, జి.రవికుమార్, మజ్జి వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎండలో నిలబడి లోకేశ్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు



విగ్రహాన్ని బహూకరిస్తున్న జగదీష్, విజయచంద్ర



లోకేశ్‌కు గిరిజన సంప్రదాయ కిరీటం పెడుతున్న సంధ్యారాణి



పార్టీ కండువా తిప్పుతూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న లోకేశ్

మార్పు రావలసిన సమయం



చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైంది. 3,132 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన యువనేత లోకేష్ శంఖారావం మన ముందుకు రావడం ఆనందంగా ఉంది. సైకో సర్కార్ ను ఇంటికి పంపించడానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు సంయుక్తంగా ముందుకు సాగాలి.

- ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్సీ

ఉత్తరాంధ్రలో వైసీపీ నేతల దోపిడీ



ఉత్తరాంధ్రలో వైసీపీ నేతలు ల్యాండ్, శాండ్, వైన్, మైన్‌ల రూపంలో అడ్డంగా దోచేస్తున్నారు. పార్వతీపురంలో చెరువులు, ప్రభుత్వ భూములు మాయం చేసి ఇక్కడ వైసీపీ సన్నాసులు సంతకం చేసి పనికిరాని పట్టాలిస్తున్నారు. వేల కోట్లు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి విగ్రహం పెడితే సరిపోతుందా? ఆరు అడుగుల గొయ్యి తీసి జగన్ ప్రభుత్వాన్ని పాతిపెడతాం.

- మోహన్‌రావు, జనసేన సమన్వయకర్త

రాజ్యాంగబద్ధ పాలన లేదు



ఈ ప్రభుత్వంలో కేవలం రాజారెడ్డి పాలన తప్ప రాజ్యాంగబద్ధ పాలన లేదు. రివర్స్ టెండరింగ్‌లతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయటమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రాజన్నదొర పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు.

- ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉపాధి అవకాశాలు లేవు



ఈ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు. పరిశ్రమలు రావటం లేదు సరికదా ఉన్న పరిశ్రమలు సైతం మూత పడుతున్నాయి. కేవలం రూ.5వేలు జీతం ఇచ్చి వలంటీర్ ఉద్యోగాన్నే ఉద్యోగం అంటే ఎలా..? క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ఈ ప్రభుత్వానికి చరమగీతం పలకాలి

- లోకం మాధవి, జనసేన విజయనగరం జిల్లా అధ్యక్షురాలు





పార్వతీపురం సభలో విజయ సంకేతం చూపిస్తున్న గోపాల మిత్రలు, మహిళలు

యువనేతకు వినతుల వెల్లువ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై లోకేశ్‌కు పెద్ద ఎత్తున వినతిపత్రాలు సమర్పించారు. వీఆర్‌ఏ అసోసియేషన్ ప్రతినిధులు జీవో నెంబర్ 104 ప్రకారం వీఆర్‌వో ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న ప్రమోషన్ కోటాను 70 శాతానికి పెంచాలని విన్నవించారు. యూటీఎఫ్ ప్రతినిధులు ఏజెన్సీలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేసేలా గతంలో ఇచ్చిన జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. ప్రాథమిక విద్యారంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని విన్నవించారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గోపాలమిత్ర అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న 2,600 మంది గోపాలమిత్రలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని సమస్యలు విన్న లోకేష్ రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.



తనపై జరిగిన దౌర్జన్యంపై లోకేశ్‌కు వివరిస్తున్న కౌన్సిలర్ నారాయణరావు



జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రారంభిస్తున్న గుల్ల వేణుగోపాల్

లోకేశ్ సభకు మక్కువ కార్యకర్తలు

మక్కువ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సాలూరులో నిర్వహించిన శంఖారావం సభకు పార్టీ మండల శ్రేణులు బుధవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మండలంలోని 21 పంచాయతీల నుంచి సుమారు 150 ఆటోలతో పార్టీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మావుడి ప్రసాదరావు, బి.గౌరీశంకర్, డాక్టర్ పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరికలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో వైసీపీ, బీజేపీల నుంచి భారీ ఎత్తున చేరికలు జరిగాయి. పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు చుక్క లక్ష్మణనాయుడు, నాయకులు చుక్క పోలినాయుడు, ఎంఆర్‌నగరం మాజీ సర్పంచ్ రొంపిల్లి తిరుపతిరావు సతీమణి సుభద్రమ్మ, చిన్న బొండపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి చిట్టిబాబు, జమ్మిడివలసకు చెందిన కర్రి వినోద్ తదితరులు తమ అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి, అరకు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో లోకేశ్

సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

పాలకొండ: పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ శంఖారావం పర్యటన విజయవంతమైందని ఆ పార్టీ పాల కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ విజయవంతం కావడంతో రానున్న ఎన్నికల్లో విజయం స్పష్ట మైందని పేర్కొన్నారు. సభను విజయవంతం చేసిన టీడీపీ, జనసేన శ్రేణులు, ప్రజలకు జయకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

● **గుమ్మలక్ష్మీపురం:** కురుపాం నియోజకవర్గంలో మంగళవారం లోకేశ్ సభను విజయవంతంచేయడంతో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కురుపాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ధన్యవాదాలు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడా రు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యం

భామిని: రానున్న ఎన్నికల్లో గెలుపు తథ్యమని భామిని మండల టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం భామినిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గంలో యువగళం యాత్రలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో దుష్ప్రచారంచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కనీసం మండలంలో నదీతీరంలో ఇసుక కూడా వినియోగించలేని పరిస్థితి నెలకొం దని చెప్పారు.రహదారులు అధ్వానంగాఉన్నా పట్టించుకున్న నాథుడు లేడ న్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రవినాయుడు, ఎం.జగదీశ్వ రరావు, గోవిందరావు, మనోజ్, రామారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 25 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్, ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం పరిశీలించారు.ఈసందర్భంగా మౌలికసదుపాయాల కల్పన కు ఒక్కో కేం ద్రానికి రూ.30 వేలు చొప్పున నిధులు మంజూరు చేశారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బం ద్‌ను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మండంగి రమణ, ఎం.సన్యాసిరావు, బి.శంకరరావు, కోరాడ ఈశ్వరరావు, బి.రాజారావు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** నల్లచట్టాలను రద్దు చేయాలని రైతులు చేపట్టిన ఉద్యమంలో అప్పట్లో ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఈనెల 16న గ్రామీణ భారత్‌బంద్‌ను చేపడుతున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, వెలమల సత్యనారాయణలు తెలిపారు. బుధవారం రావివలస గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు.

అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ధ్వజం

భామిని: రెవెన్యూ, ఉపాధి, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీపీ తోట శాంతకుమారి అధ్యక్షతన భామిని మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కోసలిసర్పంచ్ మజ్జి మోహన్‌రావు మాట్లాడుతూ భూసర్వేలో తప్పుల తడకలు ఉన్నాయని, రైతులు ఎవరికి చెప్పాలో తెలియని పరిసితి నెలకొం దని ప్రశ్నించారు. వ్యవసాయ బోర్లకు సరఫరా చేసే విద్యుత్ తీగలు వాలిపోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారని బాలేరు ఎంపీటీసీ చంద్రశేఖరరావు తెలిపారు. విద్యుత్ ఏఈ సమావేశాలకు హాజరుకావడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషోర్‌కుమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిరంజీవులు, తోట సింహాచలం, దర్మారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త వహించాలి

పాలకొండ: ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై జాగ్రత్త వహించాలని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం తలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్య క్రమంలో హెచ్‌ఎం అప్పారావు, పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

జీవో- 57 ప్రకారం జీతాలు ఇవ్వాలి

వీరఘట్టం: వీరఘట్టం పంచాయతీలో కార్మికులకు ప్రభుత్వంవిడుదల చేసిన జీవో- 57, 132 ప్రకారం పంచాయతీకి వచ్చిన ఆదాయంలో 60 శాతం నిధులు జీతాలకు వెచ్చించాలని ఏపీ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు.బుధవారం వీరఘట్టంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు.అనంతరం గ్రామీణబంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఏపీపంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌వైనాయుడు,వీరఘట్టం పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించండి

పాలకొండ: డంపింగ్‌యార్డును తరలించాలని పాలకొండ నగర పంచాయతీ పరిధిలో గల ఒకటి, పది వార్డుల యువకులు కోరారు.ఈ మేరకు బుధవారం ఆయా వార్డుల పరిధిలో వీధుల ప్రజలు, యువకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంపింగ్‌యార్డువల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, పొగపీల్చడం వల్ల పలుసమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. డంపింగ్‌యార్డు తరలించాలని ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. కాగా ఈ విషయం నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలుసుకుని ధర్నా చేస్తున్న స్థలానికి వెళ్లారు. ఈ సమస్యను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు.

నేడు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

పట్టణంలోని 1, 2, 20 పరిధిలోని డంపింగ్‌యార్డును తరలించాలని ఆ వార్డు ప్రజలు, యువకులు గురువారం ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నాచేయనున్నారు. ఈ మేరకు 1, 2, 20 వార్డుల్లో బుధవారం రాత్రి దండారా వేయించారు. డంపింగ్‌యార్డు తరలించే వరకు పోరాటం చేద్దామని, ర్యాలీ పట్టణంలోని గొల్లవీధి సెంటర్ నుంచి బయలుదేరనున్నట్లు యువకులు పేర్కొన్నారు.

కనీస వేతనం రూ.10 వేలకు పెంచాలి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ల కనీస వేతనం రూ.10 వేలకు పెంచాలని సీఐటీయూజిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్‌చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట బుధవారం నుంచి దీక్ష చేపట్టారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.కాంతారావు, ఎన్.నీలంరాజు, బి.పార్వతీ, ఎం.సోములమ్మ, ఎస్.శిరీష పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం దీక్ష వద్దకు వచ్చిన పార్వతీపురం ఐటీడీఏ పి.మురళీధర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, సంఘ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, సంఘ పట్టణ నాయకుడు బి.సూరిబాబు, ఏడు పీహెచ్‌సీలకు చెందిన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు పాల్గొన్నారు.

నిర్బంధ కాండను ఖండించాలి

పార్వతీపురంటౌన్: రైతులపై మోదీ ప్రభుత్వం చేస్తున్న అమానుష నిర్బంధ కాండను మేధావులు, విద్యావంతులు ఖండించాలని ఏపీ రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు ఎస్.రూపాస్వీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పంజాబ్, హర్యానా రైతాంగంపై మోదీ ప్రభుత్వం చేస్తున్న అఘాయిత్యాలు, నిర్బంధాలు సరికాదన్నారు.

ప్రతిభా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: జోగింపేట గిరిజనసంక్షేమ ప్రతిభ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 8వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశించేందుకు మార్చి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ పి.వెంకటినాయుడు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

'విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు'

మక్కువ: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. అనసభద్ర సమీపంలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల భవనాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు.

రబీకి సాగునీరు విడుదల

గరుగుబిల్లి: జంఝావతి ప్రాజెక్టు నుంచి రబీకి సాగునీటిని విడుదలచేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో పైనుంచి వచ్చిన మేరకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి పైనుంచి 100 క్యూసెక్కుల నీటి ప్రవాహం రాగా.. కాలువ ద్వారా 80 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి: డీఈ

గరుగుబిల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన జల జీవన్ మిషన్ కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు సమాఖ్య సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీశంకర్ పాల్గొన్నారు.

సంజీవయ్యకు నివాళి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ సమావేశమందిరంలో సంజీవయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘికసంక్షేమశాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్, బీసీవెల్ఫేర్ అధికారి కృష్ణ, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రామారావు, సూపరింటెండెంట్లు సుజాత, చిన్ని కృష్ణ, శ్రీనివాసరావు, సూర్యనారాయణ,డీపీఆర్వో ఎల్.రమేష్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

సాలూరు రూరల్/పార్వతీపురం టౌన్/కురుపాం/ గుమ్మలక్ష్మీపురం: వసంత పంచమి పురస్కరించుకుని జిల్లాలోని సరస్వతిదేవి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. వివిధ దేవీ ఆలయాల్లో అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. సాలూరు మండలం కొత్తవలస ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహానికి విద్యార్థులు పూజలుచేశారు. పార్వతీపురంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గల జ్ఞాన సరస్వతీ అమ్మవారి వద్ద ధర్మశాస్త్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, గుమ్మలక్ష్మీపురం చింతలగూడవీధి పాఠశాలలో అక్షరాభ్యాసం చేశారు. కురుపాంలో గాయత్రి ప్రజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

రైతులను ఆదుకోవాలి

బెలగాం: ఏనుగుల వల్ల వివిధ రకాల పంటలు నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని సీపీఎం జిల్లా సభ్యుడు సాంబమూర్తి, రామారావుడిమాండ్‌చేశారు.పార్వతీపురం అటవీశాఖకార్యాలయంలో సూపరింటెండెంట్ పుష్పలతకు వినతిపత్రం అందించారు.

డీఎఫ్‌వో ఓహోల్ సచిన్ అన్నాసాహెబ్

ఒడిశా

రాయగడ: రాయగడ జిల్లా అటవీ శాఖాధికారిగా ఓహోల్ సచిన్ అన్నాసాహెబ్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇంతవరకు గజపతి, రాయగడ జిల్లాల అటవీ శాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఆనంద్ నుంచి సచిన్ బాధ్యతలు స్వీకరించారు. సచిన్ ఇంతకుముందు అనుగూల్ జిల్లా అసిస్టెంట్ డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై రాయగడ డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. దీంతో ఆనంద్ గజపతి జిల్లా డీఎఫ్‌వోగా పరిమితమయ్యారు.

అమర వీరులకు నివాళి

రాయగడ: పుల్వామా అమర వీరులకు నివాళిగా రాయగడ జిల్లా ఔషధ దుకాణాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలాజీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ జవాన్లు, స్థానికులు పాల్గొని, రక్తదానం చేశారు.